సాక్షి
పెద్దపల్లి

శుక్రవారం । 15 । డిసెంబర్ । 2023



మంత్రులను కలిసిన ఎమ్మెల్యే

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు గురువారం హైదరాబాద్‌లో మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, శ్రీనివాసరెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు.



ముందస్తు క్రిస్మస్ వేడుకలు

కోల్‌సిటీ: గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో గురువారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను వైద్య సిబ్బంది ఘనంగా నిర్వహించారు.

గరిష్టం/కనిష్టం
29.0/17.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

అర్థవంతమైన చర్చ జరగాలి



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాగూర్

గోదావరిఖని(రామగుండం): రాష్ట్ర నూతన శాసన సభాపతి నేతృత్వంలో అర్థవంతమైన చర్చ జరగాలని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాగూర్ పేర్కొన్నారు. గురువారం అసెంబ్లీలో మాట్లాడుతూ, ఏకగ్రీవంగా ఎన్నికైన శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ అభినందనలు తెలిపారు. శాసనసభ సంప్రదాయాలు, ప్రజాస్వామిక విలువలు ఫరిడవిల్లాలని పేర్కొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పెరగాలి



విద్యార్థులతో భోజనం చేస్తున్న జెడ్పీ సీఈవో

పెద్దపల్లిరూరల్: మధ్యాహ్న భోజనాన్ని మరింత నాణ్యతగా తయారు చేయాలని జెడ్పీ సీఈవో శ్రీనివాస్ నిర్వాహకులను ఆదేశించారు. గురువారం పెద్దపల్లి మండలం రంగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యా బోధనను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఇక నుంచి విద్యార్థులకందించే భోజనం నాణ్యత మెరుగుపడాలన్నారు. పాఠశాలను తనిఖీ చేసి నివేదికను కలెక్టర్‌కు అందించామని సీఈవో వివరించారు.

రాష్ట్రస్థాయి రైఫిల్ పోటీల్లో ప్రతిభచాటాలి



పోటీలను ప్రారంభిస్తున్న డీఈవో మాధవి

పెద్దపల్లిరూరల్: రాష్ట్రస్థాయి రైఫిల్ పోటీల్లో మెరుగైన ప్రతిభ కనబర్చి ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు పేరుప్రతిష్టలు తేవాలని జిల్లా విద్యాధికారి మాధవి అన్నారు. పెద్దపల్లిలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం ఉమ్మడి కరీంనగర్ స్థాయి రైఫిల్ పోటీలు నిర్వహించగా, ప్రారంభించి మాట్లాడారు. పోటీల్లో ప్రతిభా నైపుణ్యాలను ప్రదర్శించినవారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. ఈ నెల 16,17వ తేదీల్లో హైదరాబాద్ గచ్చిబౌలిలోని సెంట్రల్ యూనివర్సిటీ షూటింగ్ రేంజ్‌లో రాష్ట్ర స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలు జరుగుతాయని ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ శ్రీనివాస్, ఎంఈవో సురేంద్రకుమార్ తెలిపారు.

అండర్-14 క్రికెట్ విజేత పెద్దపల్లి



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి

రామగిరి(మంథని): మంథని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా అండర్-14 క్రికెట్ పోటీల్లో పెద్దపల్లి జట్టు విజేతగా నిలిచింది. పోటీల్లో కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల క్రీడాకారులు పాల్గొన్నారు. ఫైనల్లో రాజన్న సిరిసిల్ల- పెద్దపల్లి జట్లు పోటీపడగా పెద్దపల్లి జట్టు విజయం సాధించింది. విజేత జట్టుకు కళాశాల ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో ఎస్జీఎఫ్ సెక్రటరీ, పీఈటీలు కొమురోజు శ్రీనివాస్, సోమశేఖర్, జావిద్, అజయ్, డేవిడ్, కొముర్రోజు కృష్ణ, శ్రీనివాస్, కళాశాల పీడీ పింగిలి కృష్ణారెడ్డి, బుద్ధుల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

20లోగా దరఖాస్తు చేసుకోవాలి

పెద్దపల్లిరూరల్: వరల్డ్ స్కిల్ కాంపిటీషన్ పోటీల్లో పాల్గొనే వారు ఈనెల 20లోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి తిరుపతిరావు తెలిపారు. వరల్డ్ స్కిల్ కాంపిటీషన్ 2024 పోటీలు ఫ్రాన్స్‌లో నిర్వహించనున్నారని పేర్కొన్నారు. జిల్లా, రాష్ట్ర, ప్రీ నేషనల్, నేషనల్, ఇంటర్నేషనల్ స్థాయిలో పోటీలు జరుగుతాయని జిల్లా ఉపాధి కల్పనాధికారి తెలిపారు.

యువత చేతిలో 'గుర్తింపు'

- సింగరేణి సంస్థలో 16వేల మంది యువకులు
- ఇప్పటికే ఆధిక్యాన్ని ప్రదర్శిస్తున్న యువ కార్మికులు
- తమ సమస్యలపై కార్మిక సంఘాలకు అల్టిమేటం
- సామాజిక మాధ్యమాల ద్వారా డిమాండ్లు
- ఆ దిశగా యూనియన్ల పావులు



గోదావరిఖని(రామగుండం): సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో యువ కార్మికులు కీలకం కానున్నారు. సంస్థలో పనిచేస్తున్న సీనియర్ కార్మికులు దిగిపోగా కారుణ్య నియామకాలతో వారి పిల్లలు ఉద్యోగాల్లో చేరారు. కారుణ్య నియామకాలు మొదలైన తర్వాత గుర్తింపు ఎన్నికలు నిర్వహించడం ఇదే మొదటి సారి. ఈక్రమంలో సింగరేణిలో గుర్తింపు ఎన్నికలు ఈనెల 27న జరగనున్నాయి. ప్రస్తుతం సంస్థలో 39వేల మంది కార్మికులుండగా అందులో 16వేల మంది యువ కార్మికులు ఉన్నారు. 45శాతం మంది యువకార్మికులు తమ ఆధిక్యాన్ని చాటనున్నారు. దీంతో గతంలో ఎన్నికలకు భిన్నంగా ఈసారి ఎన్నికలకు ప్రాధాన్యం పెరిగింది.

ఏటా తగ్గుతున్న కార్మికుల సంఖ్య

సింగరేణి సంస్థలో శరవేగంగా సాగుతున్న కాంట్రాక్టీకరణ, ప్రయివేటీకరణ, యాంత్రీకరణ నేపథ్యంలో ఏటా కార్మికుల సంఖ్య తగ్గుతూ వస్తోంది. 1.60 లక్షల మంది కార్మికులున్న సంఖ్య ప్రస్తుతం 39వేలకు చేరుకుంది. అయితే పర్మినెంట్ కార్మికులతో సమాంతరంగా కాంట్రాక్టు కార్మికులు పెరుగుతున్నారు. 25వేల మంది ఇప్పటికే కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారు. ఓసీపీల్లో సంస్థకు పోటీగా ప్రయివేట్ ఓబీ సంస్థలు పనిచేస్తున్నాయి. అయితే రాబోయే రోజుల్లో సంస్థ ఉనికి ప్రమాదకరంగా మారే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ సమయంలో యువ కార్మికులు ఈ ఎన్నికలపై ప్రత్యేక దృష్టిసారించారు. తమ డిమాండ్లను ఇప్పటికే సామాజిక మాధ్యమాల ద్వారా యూనియన్ల దృష్టికి తీసుకవస్తున్నారు. చాలా మంది యువతకు ఏ యూనియన్‌లో సభ్యత్వం లేకపోవడంతో గుర్తింపు ఎన్నికల్లో యువ ఓట్లు ఎటువైపు మళ్లుతాయోనని యూనియన్లవారు ఎవరికివారే అంచనాల్లో ఉన్నారు.

యువత పయనం ఎటు

యువ ఓటర్లు ఈసారి ఎన్నికల్లో దిశానిర్దేశంపై దృష్టి సారించారు. తమ సమస్యలు పట్టించుకునే యూనియన్‌కు మద్దతు ఇవ్వాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. గత గుర్తింపు యూనియన్‌పై వ్యతిరేకతతో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్కటి మినహా అన్ని స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకుంది. ఈక్రమంలో ఈసారి ఎన్నికల్లో ఎవరికి మద్దతు ఇవ్వాలనే దానిపై యువ కార్మికులు మల్లగుల్లాలుపడుతున్నారు.

డిమాండ్లు ఇవే..

- భూగర్భగనులు పెంచాలి. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి.
- సొంతింటికి స్థలం లేదా క్వార్టర్‌ను పర్మినెంట్‌గా కేటాయించాలి.
- కార్మికుల పిల్లలకు సీబీఎస్ఈ విధానంలో విద్య బోధించాలి.

గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో కార్మికుల సంఖ్య ఇలా..

ఎన్నికలు	కార్మికులు		
1998	96,975	2007	70,942
2001	85,092	2012	60,277
2003	76,517	2017	49,877
		2023	39,832

- వేతనాల్లో ఇన్‌కంటాక్స్ మినహాయించాలి. కార్మికుల మారు పేర్ల సమస్య పరిష్కరించాలి.
- హెల్త్ ఎమర్జెన్సీ సమయంలో రెఫరల్ ఆన్‌లైన్‌లో జరిగేలా చూడాలి.
- అన్ని వ్యాధులకు సీపీఆర్ఎంఎస్ కార్డు వర్తింపజేయాలి. ఏరియా ఆసుపత్రిల్లో వైద్య నిపుణులను నియమించాలి.
- రిటైర్డ్ కార్మికులకు ఏరియా ఆసుపత్రుల్లో ఉచిత వైద్యం అందించాలి. వారసుల వయోపరిమితి 35 నుంచి 40 ఏళ్లకు పెంచాలి.
- అధికారుల మాదిరిగా కార్మికుల గ్రాడ్యుటీ సీలింగ్ కార్మికులకు వర్తింపజేయాలి.
- తీవ్రమైన అనారోగ్య సమస్యలున్న కార్మికులను మరో సారి మెడికల్ బోర్డుకు పిలవాలి.

కమలం.. కలకలం



మాట్లాడుతున్న గుజ్జుల రామకృష్ణారెడ్డి

- ఎంపీ సంజయ్‌పై గుజ్జుల, పొల్సాని తిరుగుబాటు
- అధిష్టానానికి ఫిర్యాదు చేసేందుకు సిద్ధం
- వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో సీనియర్లకు అవకాశమివ్వాలని తీర్మానం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కరీంనగర్ కమలం పార్టీలో కలకలం రేగింది. కొన్నేళ్లుగా నివురుగప్పిన నిప్పులా ఉన్న అసంతృప్తి భగ్గుమంది. రాష్ట్ర, జాతీయ స్థాయిలో వివిధ పదవులు నిర్వహించిన ఉమ్మడి జిల్లాకు చెందిన సీనియర్లు, కార్యకర్తలు దాదాపు 100 మంది ఎంపీ బండి సంజయ్‌పై తిరుగుబావుటా ఎగురవేశారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఆయనను తప్పించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కరీంనగర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సమావేశమయ్యారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఎంపీ సంజయ్ ఒంటెద్దు పోకడలతో పార్టీ పూర్తిగా అవసాన దశకు చేరిందని, ఎంపీగా, రాష్ట్ర అధ్యక్షుడుగా విఫలమయ్యారని ఆరోపించారు. అనేక త్యాగాలు చేసి, బీజేపీకి విధేయులుగా ఉంటూ నక్సలైట్ల చేతిలో ఎన్నో ఇబ్బందులకు గురైన వారిని కాదని బండికి పట్టం కడితే పార్టీకి ఆయన చేసిందేమిటని ప్రశ్నించారు.

బీజేపీ బచావో..

బీజేపీ బచావో కార్యక్రమం కరీంనగర్ నుంచే ఆరంభించాలని సమావేశంలో నిర్ణయించారు. పాత వారిని కరివేపాకులాగా వాడుకుంటున్నారని కేంద్ర నాయత్వం దృష్టికి తీసుకెళ్లాలని తమ అభిప్రాయాలను వెల్లడించారు. జాతీయ నాయకులను కలవడంతోపాటు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రణాళిక రూపొందించారు. రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డితోపాటు ఇతర గుర్తింపు పొందిన నాయకులను కలిసి పరిస్థితిని వివరించేందుకు సిద్ధమయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికలకు అనుగుణంగా ప్లాన్ చేసుకోవాలన్న ఉద్దేశంతో పావులు కదిపేందుకు సీనియర్లు ఏకమయ్యారు. బండి సంజయ్ ఒక్కడికే అన్ని అవకాశాలు వస్తున్నాయని, అయినప్పటికీ పార్టీకి ప్రత్యక్ష ఎన్నికల్లో ఏ విధంగా ఉపయోగపడటం లేదన్నారు. గతంలో ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు గెలిచేవారని, బండి వచ్చాక గెలుపు అవకాశాలు తగ్గాయని పేర్కొన్నారు. విద్యాసాగర్‌రావు ఎంపీగా ఉన్నప్పుడు కరీంనగర్ జిల్లా పరిషత్ ఎన్నికల్లో అధిక స్థానాలు గెలుచుకున్న విషయాన్ని గుర్తు చేశారు. దీంతోపాటు సీనియర్లను పూర్తిగా పక్కన పెడుతున్నారని, వారి మనోభావాలకు, కష్టాలకు గుర్తింపు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రధాని పర్యటనపై కినుక..

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎన్నికల ప్రచారానికి వచ్చినప్పుడు సంజయ్ తన భజనపరులను మాత్రమే ఆయనకు కలిపించాడని ఆరోపించారు. పదవులు కూడా వారికే వచ్చాయన్నారు. రాణీ రుద్రమకు, సిరిసిల్ల అసెంబ్లీకి ఏం సంబంధమని ప్రశ్నించారు. తుల ఉమ టికెట్ ఎవరు రద్దు చేయించారు? ఎందుకు చేయించారో అందరికీ తెలుసన్నారు. కరీంనగర్ జిల్లాలో బీజేపీ పటిష్టంగా ఉండేదని, బండి వచ్చాకే వెనబడిందని ఆరోపించారు. కరీంనగర్‌లో పోటీ చేసిన ఆయన గెలవలేదు, టికెట్లు పొందినవారు గెలవలేదు.. ఎందుకు ఓటమి చెందామనే కారణాలపై కూడా సమీక్ష జరపకపోవడం శోచనీయమన్నారు. సిద్ధాంతపరంగా కొనసాగిన వారికి గుర్తింపు లేదని వాపోయారు. ఇప్పటికైనా ఆయనను తప్పించి, సీనియర్లకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

గతంలో రెండుసార్లు సమావేశం..

బీజేపీ సీనియర్లు రెండేళ్ల క్రితం కూడా సమావేశం పెట్టుకొని, బండిపై అసంతృప్తి వెళ్లగక్కారు. ఆ సమయంలో ఆయన రాష్ట్ర అధ్యక్షుడిగా ఉండగా, ఆ పదవి నుంచి తొలగించాలని అధిష్టానాన్ని కోరారు. కానీ, అధిష్టానం సీనియర్లపై పార్టీ క్రమశిక్షణ చర్యలకు ఉపక్రమించింది. చివరి నిమిషంలో సీనియర్ నాయకుడు ఇంద్రసేనారెడ్డిని రంగంలోకి దింపి, సయోధ్య కుదిర్చారు. ఇదిలా ఉండగా పెద్దపల్లిలోని గుజ్జుల రామకృష్ణారెడ్డి నివాసంలో ఈటల రాజేందర్, పొల్సాని మురళీధర్‌రావులు సమావేశమై, బండిని అధ్యక్ష పదవి నుంచి తొలగించాలంటూ అధిష్టానంపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. పావులు కదిపి, అధ్యక్ష పీఠం నుంచి తప్పించేలా చేశారన్న ఆరోపణలున్నాయి.

అధిష్టానం ఎలా స్పందిస్తుందో?

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బండికి ఎంపీ టికెట్ ఇవ్వొద్దని, సీనియర్లకే ఇవ్వాలంటూ తీర్మానం చేశారు. అయితే, పదేపదే బయటపడుతున్న అసంతృప్తి అంశంపై అధిష్టానం ఎలా స్పందిస్తుందో వేచిచూడాలి. సమావేశంలో గుజ్జుల రామకృష్ణారెడ్డి, కాసిపేట లింగయ్య, కన్నెబోయిన ఓదెలు, కన్నం అంజయ్య, లింగంపల్లి శంకర్, ఎస్ఈఎస్ రాజు, మోహన్‌రెడ్డి, పిన్నింటి రాజు, సంజీవరెడ్డి, రాంబాబు, మెట్‌పల్లి కృష్ణమాచారి, గాజుల వేణు, పురుషోత్తంరావు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



పోటీలు ప్రారంభిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



రన్నింగ్ పోటీల్లో తలపడుతున్న దివ్యాంగులు

పెద్దపల్లిరూరల్: దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని, మనోధైర్యం తోడైతే విజయాలు సొంతమవుతాయని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. గురువారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన జిల్లాస్థాయి ఆటల పోటీలను కలెక్టర్ ప్రారంభించారు. పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన దివ్యాంగులతో కాసేపు క్యారం ఆడి ఉల్లాసపరిచారు. తమకు వైకల్యం ఉందనే ఆలోచనను రానీయకుండా గట్టి పట్టుదలతో ముందుకు సాగాలన్నారు. దివ్యాంగులు వారి వారి ఆలోచనలను బట్టి స్వయం ఉపాధి పొందాలనుకునే వారు తమ దరఖాస్తులను అందిస్తే యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు బ్యాంకర్లతో మాట్లాడి రుణాలను అందిస్తామని పేర్కొన్నారు. ముగింపు కార్యక్రమానికి అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. జిల్లా సంక్షేమశాఖ అధి కారి రవుఫ్‌ఖాన్, డీఆర్‌డీవో శ్రీధర్, డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, డీఈవో మాధవి, డీవైఎస్‌వో సు రేశ్, దివ్యాంగ ప్రతినిధులు వినయ్‌చంద్, రవికిరణ్, స్ఫూర్తి, మనోచైతన్య మానసిక పాఠశాలల వి ద్యార్థులు, సీడీపీవోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పట్టాలు దాట'పోయారు'

- రైలు ఢీకొని ఇద్దరు దుర్మరణం



రాజు (ఫైల్)



యాకూబ్ అహ్మద్ (ఫైల్)

పెద్దపల్లిరూరల్: పట్టాలు దాటబోయి ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఇరువురు దుర్మరణం పాలైన సంఘటన పెద్దపల్లి రైల్వేస్టేషన్ ఆవరణలో జరిగింది. రామగుండం రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని మోమిన్‌పురకు చెందిన ఎండీ యాకుబ్ అహ్మద్ (40), పెద్దపల్లి మండలం పెద్ద బొంకూర్‌కు చెందిన నడిగొట్టు రాజు (53) పట్టణంలోని ఓ కూల్‌డ్రింక్స్ ఏజెన్సీలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. గురువారం రెండో నంబర్ ప్లాట్‌ఫాంపై ఉన్న క్యాంటీన్‌కు కూల్‌డ్రింక్స్ పెట్టెలు వేసి తిరిగి బయటకు వెళ్లేందుకు పట్టాలు దాటబోయారు. ఇంతలో ఢిల్లీ నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్తున్న తెలంగాణ ఎక్స్‌ప్రెస్ వేగంగా దూసుకొచ్చి ఢీకొట్టడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. రాజు భార్య చాలా ఏళ్ల క్రితమే మరణించగా.. ఉన్న ఒక్క కొడుకును బంధువుల సహకారంతో గురుకుల పాఠశాలలో చేర్పించినట్లు తెలిసింది. రైలు రాకను గుర్తించి ఆగితే ప్రాణాలు దక్కేవని, రైలు సమీపంలోకి అకస్మాత్తుగా రావడంతో భయాందోళనకు లోనై ఒకరినొకరు పట్టుకోవడంతో ప్రాణాలు పోగొట్టుకున్నారనే అభిప్రాయాలను ఘటనా స్థలంలో ఉన్న ప్రయాణికులు వ్యక్తం చేశారు. ఏదేమైనా పట్టాలు దాటే ప్రయత్నంలో రెండు నిండుప్రాణాలు గాలిలో కలిసిపోయాయని స్థానికులు విచారం వ్యక్తం చేశారు. రామగుండం రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వారం రోజులుగా వణుకు

జ్యోతినగర్(రామగుండం): ఒక్కసారిగా చలి పెరిగింది. గురువారం పగటి ఉష్ణోగ్రతలు 29.0 డిగ్రీల సెల్సియస్ కాగా కనిష్టంగా 15.0 డిగ్రీలకు తగ్గడంతో జనం చలికి వణిపోతున్నారు. వారం రోజుల నుంచి రోజురోజుకు ఉష్ణోగ్రతలు తగ్గిపోవడంతో ప్రజలు సాయంత్రం సమయాల్లో ఇళ్లనుంచి బయటకు రావడానికి భయపడిపోతున్నారు. సాయంత్రం 6 గంటలకే చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పడిపోవడంతో చిన్న పిల్లలు, వృద్ధులు, వ్యాధిగ్రస్తులు చలికి బయటకు వెళ్లకూడదని వైద్యులు సూచిస్తున్నారు.

వారం రోజులుగా ఉష్ణోగ్రతలు..

తేదీ	గరిష్టం	కనిష్టం
08	27.6	18.8
09	30.0	17.0
10	29.6	15.6
11	30.2	15.2
12	29.6	14.6
13	30.0	15.4
14	29.0	15.0

ఆధార్, బయోమెట్రిక్ సేకరణపై అనుమానాలు

- 100కు డయల్ చేసి పోలీసులకు అప్పగించిన పెద్దబొంకూర్ వాసులు



పెద్దబొంకూర్‌లో బయోమెట్రిక్ సేకరిస్తున్న గుర్తు తెలియని వ్యక్తులు

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వం అందించే మహాలక్ష్మి పథకం కావాలంటే మహిళలు తమ ఆధార్‌నంబరు నమోదు చేసుకొని ఫొటో, వేలి ముద్ర వేయాలని ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు చెప్పడంతో పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్ గ్రామంలో మహిళలు బారులుదీరారు. మహిళల పూర్తి ఆధారాలను గుర్తు తెలియని వ్యక్తులు సేకరిస్తుండడాన్ని ప్రశ్నించడంతో డిజిటల్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్నామని బదులిచ్చారని గ్రామస్తులు మిట్టపల్లి శ్రీనివాస్, కలవేన రాయమల్లు, బొడ్డుపల్లి రాజేశం, కలవేన రవి, ఆవునూరి అనిల్ తెలిపారు. వారు హన్మకొండకు చెందిన వారుగా పేర్కొంటున్నారని వివరించారు. పొంతనలేని సమాధానాలు చెప్పడంతో 100 నంబరుకు డయల్ చేసి ఇరువురిని పెద్దపల్లి పోలీసులకు అప్పగించారు. అసలే ఆధార్ నంబరు ఆధారంగా బ్యాంకుల నుంచి డబ్బులు మాయమవుతున్న ఘటనలు జరుగుతుండగా, గుర్తు తెలియని వ్యక్తులు ఇలా ఆధారాలు సేకరిస్తుండడాన్ని అనుమానించామని గ్రామస్తులు పేర్కొన్నారు.

ఆదిలోనే అడ్డంకులు

- జాతీయ రహదారి నిర్మాణంలో జాప్యం
- పూర్తి కాని భూసేకరణ.. పరిహారంపై పేచీ
- ప్రధాని శంకుస్థాపన చేసి ఐదునెలలు
- ప్రారంభం కాని మొదటి ప్యాకేజీ పనులు
- వరుస ఎన్నికల నేపథ్యంలో మరింత ఆలస్యమయ్యే అవకాశం



గ్రీన్‌ఫీల్డ్ హైవే నమూనా



మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలని ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న రైతులు(ఫైల్)

మంథని: నాగ్‌పూర్- విజయవాడ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే (ఎన్‌హెచ్-163)లో భాగంగా మంచిర్యాల- వరంగల్ మధ్య మొదటి ప్యాకేజీలో నిర్మించనున్న జాతీయ రహదారి పనులు ఆలస్యమవుతున్నాయి. గత జూలైలో ప్రధాని నరేంద్రమోదీ హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో రహదారి పనులకు శంకుస్థాపన చేయగా, ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదు. రహదారి నిర్మాణానికి సంబంధించి డిటేల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) విడుదల చేసి టెండర్లు పూర్తయినప్పటికీ అసెంబ్లీ ఎన్నికలు, భూ సేకరణ తదితర కారణాల వల్ల పనులు ముందుకు సాగడం లేదు.

మొదటి ప్యాకేజీలో..

కొత్తగా నిర్మించే జాతీయ రహదారికి 2021 ఫిబ్రవరి 3న గెజిట్ నోటిఫికేషన్ విడుదలైంది. గ్రీన్‌ఫీల్డ్ హైవే తరహాలో పట్టణాలు, జనావాసాలకు దూరంగా మైదాన ప్రాంతాల గుండా సాగే ఈ జాతీయ రహదారిని నాగ్‌పూర్ నుంచి విజయవాడ వరకు చేపట్టనున్నారు. ప్యాకేజీ-7 కింద చేపట్టే ఎక్స్‌ప్రెస్ రోడ్డును మూడు ప్యాకేజీల్లో భాగంగా మంచిర్యాల సమీపంలోని జైపూర్ మండలం నార్వ నుంచి పెద్దపల్లి జిల్లా మంథని మండలం పుట్టపాక వరకు 31.466 కిలో మీటర్లు మొదటి విడతలో తీసుకున్నారు. నాలుగు వరుసల రహదారి నిర్మాణాన్ని 2027 వరకు పూర్తి చేసేలా డీపీఆర్‌లో పొందుపరిచారు. అయితే ప్యాకేజీ-1లోనే పెద్దపల్లి జిల్లా ఉండగా, అడ్డంకులు పెద్దగా ఉండవని అనుకున్న క్రమంలో భూసేకరణకు అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఎన్నికలకు ముందు వేగంగా భూ సేకరణ ప్రక్రియ సాగగా, మరో వారం పది రోజులు దృష్టి సారిస్తే పూర్తవుతుందని సమాయత్తమైన అధికారులకు ఎన్నికలు గుదిబండగా మారాయి. అసెంబ్లీ ఎన్నికల మూలంగా ఆ ప్రక్రియ రెండున్నర మాసాలుగా ముందుకు సాగడం లేదు. పైగా ఇదే నెలలో స్థానిక సంస్థల ఎన్నికలు, మరికొద్ది నెలల్లోనే పార్లమెంట్ ఎన్నికలు ఉండడంతో అధికార యంత్రాంగమంతా ఆ పనుల్లో బిజీ అయిపోయారు. దీంతో పనులు మరింత ఆలస్యమయ్యే అవకాశాలు ఉన్నాయి.

తేలని పరిహారం పంచాయితీ

ప్యాకేజీ-7 కింద మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం వేలాల నుంచి ప్రారంభమయ్యే నాలుగు లేన్ల జాతీయ రహదారి మంథని మండలం ఉప్పట్ల గోదావరి సమీపం నుంచి పోతారం, విలోచవరం, నాగారం, కన్నాల, పుట్టపాక, రామగిరి మండలం ఆదివారంపేట, బేగంపేట, నవాబ్‌పేట, ముత్తారం మండలం లక్కారం, కేశన్‌పల్లి, ముత్తారం, అడవి శ్రీరాంపూర్, ఓడేడు మీదుగా వరంగల్ వెళ్తోంది. మూడు మండలాలు, 16 గ్రామాల మీదుగా వెళ్లే ఈ దారి పొడవు 40 కిలో మీటర్లు. ఈ రహదారికి 199.7358 హెక్టార్ల(సుమారు 500 ఎకరాలు) భూమి అవసరమవుతుందని హైవే అథారిటీ సూచించింది. అయితే భూ సేకరణకు సంబంధించి పరిహారం చెల్లింపులో కొందరు కోర్టును ఆశ్రయించారు. అవార్డు పాస్ చేసేందుకు అధికారులు రైతులతో సమావేశాలు నిర్వహించగా అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. రైతులకు న్యాయం చేయాలని స్థానిక ఎమ్మెల్యే, (ప్రస్తుత రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి) డి.శ్రీధర్‌బాబు జూలైలోనే ప్రధాని నరేంద్రమోదీ, కేంద్రమంత్రితో పాటు అప్పటి ముఖ్యమంత్రికి మెయిల్ ద్వారా పంపిన వినతిపత్రంలో పేర్కొన్నారు. కాగా జాతీయ రహదారి నిర్మాణంలో కోల్పోతున్న భూములకు రూ.50 లక్షల నుంచి రూ.60 లక్షల మార్కెట్ ధర పలుకుతోంది. భూసేకరణ, పరిహారం పంచాయితీ త్వరగా తేల్చి జాతీయ రహదారి కల త్వరగా నెరవేర్చాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ సభ్యుడిగా వినోద్‌కుమార్


హరిచందన నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న వినోద్‌కుమార్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణానికి చెందిన మాదూరి వినోద్‌కుమార్ రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ సభ్యుడిగా అత్యధిక మెజార్టీతో ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో ఆయుష్ డైరెక్టరేట్ భవనంలో జరిగిన ఎన్నికలకు డైరెక్టర్ హరిచందన ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఫార్మసీ కౌన్సిల్‌కు ఎన్నికైన ఆరుగురు సభ్యుల్లో వినోద్‌కుమార్ 6,659 ఓట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచారు. మిగిలిన వారిలో పరమాత్మ 6,639 ఓట్లు, రాజు 6,530, సుధాకర్ 6,584, ప్రమోద్ 6,466, శ్రీకేశ్ 6,285 ఓట్లు సాధించి సభ్యులుగా ఎన్నికయ్యారు.

రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్ బైపాస్‌లోని బిర్లా ఓపెన్‌మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు అవనీరెడ్డి, సుహర్ష్ లు శుక్రవారం నుంచి జరగనున్న రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్‌పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల జిల్లాస్థాయిలో జరిగిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. విద్యార్థులను పాఠశాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బబిత విశ్వనాథన్, స్పోర్ట్స్ ఇన్‌చార్జి శ్రీకాంత్, కోచ్ సురేందర్‌సింగ్, అనిల్ అభినందించారు.

హత్య కేసుపై ఏఎస్పీ విచారణ

రుద్రంగి(వేములవాడ): రుద్రంగి మండల కేంద్రంలో 2022, జూన్ 16న భూ తగాదా నేపథ్యంలో జరిగిన హత్య కేసుపై గురువారం రుద్రంగిలో అడిషనల్ ఎస్పీ చంద్రయ్య విచారణ చేపట్టారు. హత్యకు దారితీసిన భూపంచాయితీ, పంచాయితీ చేసిన పెద్ద మనుషుల వివరాలను తెలుసుకున్నారు. చందుర్తి సీఐ కిరణ్‌కుమార్, రుద్రంగి ఎస్సై రాజేశ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

రెండు బైకులు ఢీ

- ఒకరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు


సలీం(ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రం శివారులోని భారత్ పెట్రోల్ పంపు వద్ద బుధవారం అర్ధరాత్రి తర్వాత జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు. మండలంలోని రాచర్లబొప్పాపూర్‌కు చెందిన షేక్ సలీం(52) పని మీద సత్తెపీరీల దర్గా వద్దకు వెళ్లి వస్తుండగా అదే గ్రామానికి చెందిన లంబ రమేశ్‌యాదవ్ తన బైక్‌పై దర్గా వైపు వస్తూ రెండు బైక్‌లు ఢీకొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో సలీం తలకు బలమైన గాయాలు కావడంతో సంఘటన స్థలంలోనే మరణించాడు. రమేశ్‌కు తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

మాండలికమే మకుటం!

- పల్లె భాష.. నాయినమ్మ మాట
- విప్లవ సాహిత్య ప్రేరణతో రచనలవైపు
- దోపిడీని ఎత్తిచూపిన కవి 'అన్నవరం'

సాక్షి, కరీంనగర్ డెస్క్:

సామాజిక స్పృహ.. అట్టడుగువర్గాలపై జరుగుతున్న దొరల దోపిడీని ఎత్తిచూపిన నైజం.. దేశానికి అన్నం పెట్టే రైతన్న ఆకలితో అలమటిస్తున్నాడని చెప్పిన ధైర్యం.. అన్నీ కలబోస్తే అన్నవరం దేవేందర్. చిన్నప్పటి నుంచి తాను చూసిన పరిస్థితులపై కలంతో యుద్ధం ప్రకటించిన కవి. మట్టి మనుషుల జీవితాలను సమాజానికి పరిచయం చేశారు. ఆయన రచనలపై ఉస్మానియా, కాకతీయ వర్సిటీలలో పలువురు విద్యార్థులు పరిశోధనలు చేస్తున్నారు. ఇటీవల కేయూలో ఓ విద్యార్థిని డాక్టరేట్ పట్టా అందుకున్నారు.


అన్నవరం రచనలు


గద్దర్‌తో పుస్తకావిష్కరణ


మంత్రి పొన్నం ప్రభాకర్‌కు పుస్తకం అందిస్తూ..

మాది పాత కరీంనగర్ ప్రస్తుత సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని పోతారం(ఎస్). నాన్న దశరథం, అమ్మ కేదారమ్మ. నాకు ఒక తమ్ముడు, ఇద్దరు చెల్లెళ్లు. నాన్న ప్రభుత్వ టీచర్. మూడో తరగతి వరకు పోతారంలోనే చదివిన నేను ఎనిమిదో తరగతి వరకు అంతక్కపేటలో చదువుకున్న. తర్వాత నాన్న పోతారం గ్రామానికి బదిలీ కావడంతో హుస్నాబాద్ ఉన్నత పాఠశాలలో తొమ్మిది, పదో తరగతులు చదివాను. నేను నాయనమ్మ కనకవ్వ మాట్లాడే భాషను ఇష్టపడేవాడిని. అచ్చమైన తెలంగాణ పదాలు ఆకిలి, ఎవుసం, బడి.. వంటివి నాలో ఆసక్తిని పెంచాయి. రాత్రి వాకిట్లో మా తాత చెప్పే బేతిరెడ్డి వంటి మౌఖిక కథలు వింటూ నిద్రపోయేవాడిని. కథల్లో వచ్చే రాజ్యాలు, రాజులను ఊహించుకునేవాడిని. అలా ఊహాశక్తి పెంపొందింది.

వరంగల్‌లో సాంకేతిక విద్య

నా పదో తరగతి పూర్తయినంక వరంగల్ సాంకేతిక విద్యాసంస్థలో చేరిన. హుజూరాబాద్‌లో ఇంటర్ తర్వాత హైదరాబాద్ బీహెచ్‌ఈఎల్‌లో అప్రెంటిస్‌షిప్ పూర్తిచేసిన. మధురై కామరాజ్ యూనివర్సిటీలో దూరవిద్య ద్వారా ఎంఏ సోషియాలజీ చేసిన. ఈ క్రమంలోనే పుస్తకాలు, దినపత్రికలు చదవడం అలవాటైంది. నేను పదోతరగతి చదువుతున్న రోజుల్లో చంద్రిక అనే వార్షిక సంచిక వచ్చేది. అప్పుడే నేను రాసిన ఒక గల్పిక నా పేరుతో అచ్చయ్యింది. ఇది నాలో ఎంతో సంతోషాన్ని నింపింది.

ఉద్యోగం చేస్తున్న క్రమంలో స్వాతి వంటి సాహితీ పత్రికల్లో వచ్చే కవితలు, కథలు, వ్యాసాలు ఇష్టంతో చదివేవాడిని. హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తుండగా విరసం వంటి ప్రగతిశీల సాహిత్య, రాజకీయ సమావేశాలకు హాజరయ్యేవాడిని. ఎక్కువగా శ్రీశ్రీ, చెరబండరాజు, శివసాగర్, సినారె, శివారెడ్డి పుస్తకాలు చదివేది. విప్లవ సాహిత్యం వైపు ఆకర్షితుడిని అయ్యేందుకు పదోతరగతి చదివే సమయంలో మా సార్ పి.నారాయణరెడ్డి కారణం. ఎండాకాలం సెలవుల్లో గుఱ్ఱం జాషువా గబ్బిలం, శ్రీశ్రీ మహాప్రస్థానం పుస్తకాలు చదవాలని ఇచ్చిన సలహాతో చదివాను.

పెళ్లయిన తర్వాత ఇంటికొచ్చిన..

హైదరాబాద్‌లో అప్రెంటిస్‌షిప్ తర్వాత ఉద్యోగం పర్మినెంట్ కాలేదు. 1984లో రాజేశ్వరితో వివాహమైంది. అదే సమయంలో మా ఊరు పోతారం తిరిగి వచ్చిన. జీవగడ్డ అనే దినపత్రికలో హుస్నాబాద్ విలేకరిగా చేరిన. కేఎస్ చారి అనే న్యూస్ ఎడిటర్ తరచూ కవిత్వ పుస్తకాలు ఇచ్చేది. డెస్క్‌లో పనిచేసే అల్లం నారాయణతో సాంగత్యం ఉంది. జీవగడ్డ సంపాదకులు బి.విజయకుమార్ అంతకుముందు విద్యుల్లత అనే సాహిత్య పత్రిక నడిపేవారు. వీరందరి ప్రభావంతో సాహిత్యంపై మక్కువ పెరిగింది. హుస్నాబాద్‌లో జర్నలిస్టుగా చేస్తూనే 1986లో స్వాతి బుక్‌స్టాల్ తెరిచిన. అక్కడ నలుపు అనే పత్రికకు ఏజెంట్‌గా పనిచేసిన. దళిత, బహుజన అస్తిత్వానికి సంబంధించిన విషయాలు మొదటగా వెలుగు చూసింది నలుపు పత్రిక ద్వారానే. తర్వాత కొంతకాలానికి నాకు 1994లో పంచాయతీరాజ్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా ప్రభుత్వ ఉద్యోగం వచ్చింది. 2020లో ఉద్యోగ విరమణ చేసేవరకు కవిత్వంతోనే నా స్నేహం కొనసాగింది.

విప్లవ కవుల ప్రేరణతో..

శ్రీశ్రీ మహాప్రస్థానం, చెరబండ రాజు, శివసాగర్ పుస్తకాలు నన్ను ఎంతో ప్రభావితం చేశాయి. అదే సమయంలో ఈ నేలపై సాగుతున్న అస్థిత్వ పోరాటాలు, దోపిడీ, అన్యాయంపై జరుగుతున్న తిరుగుబాటు.. రాజ్యహింసలు నన్ను కవిత్వం వైపు మళ్లించాయి. నందిని సిధారెడ్డి, శివారెడ్డి, సి.నారాయణరెడ్డి, ఎన్.గోపీ, జూకంటి, విమలక్క ప్రముఖుల కవిత్వ పుస్తకాలను చదువుతుండేవాడిని. గుడిపాటి వెంకటేశ్వర్లు ప్రోత్సాహం, నలిమెల భాస్కర్ సహచర్యం నేను కవిత్వ కార్యాచరణకు అడుగులు వేసేలా చేశాయి.

సాహితీ సంస్థలతో సోపతి

1986లో రిక్కల సహదేవరెడ్డి, కోహెడ కొమురయ్య, అప్సర్, శంషొద్దీన్ మరికొందరం కలిసి హుస్నాబాద్‌లో నూతన సాహితీ అనే సంస్థను ఏర్పాటు చేసినం. 2010లో సాహితీ సోపతి సంస్థను నేను, నలిమెల భాస్కర్, నగునూరి శేఖర్, ఎం.నారాయణశర్మ, గాజోజు నాగభూషణం, బూర్ల వెంకటేశ్వర్లు స్థాపించినం. ఈ సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమ కరీంనగర్ కవిత్వం వల్లుబండ అనే పుస్తకాన్ని నా సంపాదకత్వంలో తీసుకువచ్చినం. కొత్త కవులను, సాహిత్యంలో అడుగుపెట్టి మధ్యలో ఆగిపోయిన వారిని ప్రోత్సహించడం కోసం 2013లో ఎన్నీల ముచ్చట్లు అనే పేరుతో ప్రతీ పౌర్ణమి రోజు కవుల సమావేశాలను నిర్వహిస్తున్నాం. ఈ కార్యక్రమంలో భాగంగా వచ్చే పుస్తకాలను సాహితీ సోపతి ఆధ్వర్యంలో ముద్రిస్తున్నాం.

మలిదశ తెలంగాణ ఉద్యమంలో..

మలిదశ తెలంగాణ ఉద్యమంలో భాగంగానే తెలంగాణ రచయితల వేదిక ప్రారంభమైంది. కరీంనగర్‌లోని కవులందరం కలిసి సమైక్యాంధ్రకు వ్యతిరేకంగా కవుల కవాతు పేరుతో ర్యాలీ తీసినం. ఉద్యమ నేపథ్యంగా తెలంగాణలోని ప్రముఖ ఉత్తమ కవితలను ఎస్ఆర్ శ్యామ్ హిందీలోకి అనువాదం చేశారు. వాటిని నేను, నలి మెల భాస్కర్, మచ్చ ప్రభాకర్ సంపాదకత్వంలో ఉడాన్ పేరుతో 2013లో పుస్తకంగా తీసుకొచ్చినం.

నాది నా ఊరి భాష

నాకు ఊహ తెలిసినప్పటి నుంచి ఇంట్లో మాట్లాడే భాష, మా వాడలో, మా ఊరిలో, చుట్టుపక్కల ఉండేవాళ్లు, పొలాల్లో రైతులు మాట్లాడేదే నా కవిత్వంలో కనిపిస్తుంది. ఇది ప్రజాస్వామ్య రాజ్యం. ఆ కోణంలో సాహిత్యం అద్దంగా మారాలని కోరుకుంటున్న. ఇందుకోసం కొత్తగా వచ్చే రచయితలు ప్రాచీన సాహిత్యం, ప్రస్తుతం వస్తున్న రచనలను అధ్యయనం చేయాలి. ప్రపంచంలో వచ్చిన ఉద్యమాలు.. ఆ సమయంలో వచ్చిన రచనలను గమనిస్తే సమాజహిత సాహిత్యం వస్తుంది.

తొవ్వతో మొదలైన ప్రస్థానం

- నేను రాసిన కవితలను కలిపి మొదటిసారి 'తొవ్వ'పేరుతో కవితా సంపుటిని 2001లో ప్రచురించిన. 1992 ప్రాంతంలో బీఎస్ రాములుతో ఏర్పడిన పరిచయం నాలో ప్రచురణ ఆలోచనను రేకెత్తించింది. తెలంగాణ ప్రజల సమస్యలను తెలంగాణ మాండలికంలోనే కవితలుగా చెప్పాను. ఇండియా టుడే వంటి పత్రికలలో వ్యాసం ప్రచురితమవడం విశేషం. అసలైతే నా మొదటి కవిత రగులుతున్న అక్షరాలు. ఇది 1990లో రాసిన జీవగడ్డ పత్రికలోనూ అచ్చయ్యింది.
- అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ నేను రాసిన నా తెలంగాణ పల్లె కవితను ఎంఏ తెలుగు పాఠ్యాంశంగా చేర్చింది.
- కాకతీయ యూనివర్సిటీ నేను రాసిన మంకమ్మతోట లేబర్ అడ్డా అనే కవితను బీఏ తెలుగు లిటరేచర్ పాఠ్యాంశంగా చేర్చింది.

కులం చిట్టీ కోసం ఇంటికి వచ్చి..

- రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


విజయ్‌కుమార్(ఫైల్)

చొప్పదండి/కరీంనగర్ రూరల్: మండలంలోని చాకుంటకు చెందిన సంబోజి విజయ్‌కుమార్(37) గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. విజయ్ కుమార్‌కు శ్రుతి అనే యువతితో ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. ఇద్దరూ కలిసి కరీంనగర్‌లో నివాసం ఉంటు ప్రైవేటు ఆసుపత్రిలో ఉద్యోగం చేసుకుంటూ జీవిస్తున్నారు. గురువారం గ్రామంలో కులం చిట్టీ ఉండటంతో చాకుంటకు వచ్చాడు. అక్కడి నుంచి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులను కలిసి, ఇతరత్రా పనులు చేసుకొని ద్విచక్ర వాహనంపై కరీంనగర్‌కు బయలుదేరాడు. కరీంనగర్ రూరల్ మండలం నగునూరు గ్రామశివారులోని ఐకేపీ కొనుగోలు కేంద్రం సమీపంలోకి రాగానే రాష్ట్ర రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకొని విలపించారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ధాన్యంకుప్పను ఢీకొని యువకుడి దుర్మరణం


శివాజీ సంజయ్ (ఫైల్)

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తి శివారు రోడ్డుపై పోసిన ధాన్యం కుప్పను ఢీకొని భవునే శివాజీ సంజయ్ (27) మృతి చెందినట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు. మహారాష్ట్ర రాష్ట్రం నాందేడ్ జిల్లా మంగురు గ్రామానికి చెందిన శివాజీ కొన్నేళ్ల క్రితం బతుకుదెరువు కోసం ఇక్కడకు వచ్చాడు. బుధవారం రాత్రి మండలంలోని బర్దిపూర్‌కు వెళ్లి తిరిగి తన ద్విచక్రవాహనంపై వేములకుర్తికి వస్తున్నాడు. రోడ్డుపై ధాన్యం కుప్ప కనిపించకపోవడంతో కుప్పను ఢీకొని అదుపు తప్పి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఏడాదిన్నర పాప, బాబు(5నెలలు) ఉన్నారు. సంఘటన స్థలాన్ని మెట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ పరిశీలించారు. మృతుడి భార్య భవునే సోని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. రోడ్డుపై వడ్ల కుప్ప పోసిన రైతు చిన్న మల్లయ్యపై కేసు నమోదుచేసినట్లు పేర్కొన్నారు.

కోలిండియా వేతన ఒప్పందాలు అమలు చేస్తాం


మాట్లాడుతున్న సత్తయ్య

గోదావరిఖని(రామగుండం): కోలిండియా వేతన ఒప్పందాలు సింగరేణిలో అమలు చేస్తామని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య హామీ ఇచ్చారు. గురువారం జీడీకే-1వ గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. బొగ్గు గని కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందాలు, ప్రమోషన్ పాలసీలు, అలవెన్సులపై ఆదాయ పన్ను రీయింబర్స్‌మెంట్ కల్పిస్తామన్నారు. కార్మికుల సంక్షేమం కోసం మెరుగైన విద్య, కార్పొరేట్ వైద్యం అందించేందుకు కృషి చేస్తామని వివరించారు. సింగరేణి సంస్థకురావలసిన విద్యుత్ బొగ్గు బకాయిలను సంస్థకు చెల్లించేలా ఒత్తిడి తీసుకవస్తామని వెల్లడించారు. వేజ్ బోర్డ్ ఒప్పందం ప్రకారం సింగరేణిలో ప్రతీ కార్మిక కుటుంబానికి స్వచ్ఛమైన రాపిడ్ గ్రావిటీ ఫిల్టరైజేషన్ నీటిని అందిస్తామని అన్నారు. కార్పొరేట్ మెడికల్ బోర్డును ప్రక్షాళన చేసి గతంలో ఉన్న 1981 సర్క్యులర్ ప్రకారం వారసత్వ ఉద్యోగాల కొనసాగింపు కృషి చేస్తామని తెలిపారు. మారుపేర్ల మార్పిడి కోసం నిరంతరం పోరాటం చేస్తున్నామన్నారు. సమావేశంలో నాయకులు హరిణ్, సతీశ్, భాస్కర్, కుమారస్వామి, లక్ష్మయ్య, రాజేశం, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలపై నిరంతర పోరాటం


గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న రాజారెడ్డి

గోదావరిఖని(రామగుండం): సింగరేణిలో జేబీసీసీఐ ఒప్పందాలు అమలు చేస్తామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. గురువారం జీడీకే-2వ గనిలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. ఈనెల 27న జరిగే గుర్తింపు సంఘం ఎన్నికల్లో సీఐటీయూని గెలిపించాలన్నారు. బదిలీ వర్కర్లకు ప్రమోషన్లలో జరుగుతున్న అన్యాయాన్ని అరికడతామని, యాక్టింగ్ చేస్తున్న కార్మికులకు ప్రమోషన్లు ఇప్పిస్తామన్నారు. మహిళా ఉద్యోగులకు చట్టబద్ధ హక్కులు కల్పిస్తామని, కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల మీద నిరంతరం పోరాడుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు జ్యోతి, బిక్షపతి, మేదరి సారయ్య, శ్రీనివాస్, ఆసరి మహేశ్, ఆరెపల్లి రాజమౌళి, వేణుగోపాల్‌రెడ్డి, కారం సత్తయ్య, వంగల రాములు, తిప్పారపు రాజు, విజయ్‌కుమార్, జనార్దన్, వంగల శివరాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా పలువురు యూనియన్‌లో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు.

అంతర్‌జిల్లా దొంగ అరెస్ట్

- రాష్ట్ర వ్యాప్తంగా 61 కేసులు
- ఇప్పటికే పీడీయాక్టులో జైలు
- సిరిసిల్లలో దొంగతనం
- రిమాండ్ పంపిన పోలీసులు



సిరిసిల్లక్రైం: రాష్ట్రంలో పలు దొంగతనాలకు పాల్పడుతున్న నిందితున్ని పట్టుకున్నట్లు సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్ గురువారం తెలిపారు. పెద్దపల్లి జిల్లా అంతర్గాం(ఝు)కు చెందిన మడక నర్సయ్యపై పలు జిల్లాల్లో 61 కేసులు నమోదుకాగా.. పలు కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చారు. సిరిసిల్లలో రెండు కేసులున్నాయి. జల్సాలకు అలవాటు పడిన నర్సయ్య సులభంగా డబ్బు సంపాదించేందుకు దొంగతనాలను ఎంచుకున్నాడు. జైలుకు వెళ్లి వచ్చిన తర్వాత కూడా దొంగతనాలకు పాల్పడడంతో పీడీయాక్ట్ అమలు చేశారు. గత ఫిబ్రవరిలో బయటకొచ్చిన అతను అక్టోబర్‌లో రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం రాళ్లపేటలోని పెద్దమ్మ గుడిలో, నవంబర్‌లో కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చింతగట్టులోని ఎల్లమ్మగుడిలో, మహబూబ్‌నగర్‌లోని మెట్టుగడ్డ ఏరియాలోని శ్రీవేంకటేశ్వరగుడిలో దొంగతనాలు చేసినట్లు రికార్డులు ఉన్నాయన్నారు. మూడు రోజుల క్రితం సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్ద బోనాల బైపాస్‌రోడ్డు పక్కన గల చిన్న హోటల్‌లోనూ దొంగతనం చేయగా బైరిగిని సురేశ్ అనే వ్యక్తి సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా గురువారం సిరిసిల్ల బైపాస్‌రోడ్‌లోని నర్సింగ్ కాలేజ్ వద్ద నర్సయ్యను పట్టుకుని కోర్టులో హాజరపరిచి రిమాండ్ తరలించారు.

బంగారం దుకాణంలో చోరీ

ధర్మపురి: బంగారం దుకాణంలో దొంగలు చొరబడి సుమారు రూ.మూడు లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన నక్కలపేట గ్రామంలో చోటు చేసుకుంది. బాధితులు ఉప్పుల నర్సింహచారి, నరేశ్ వివరాల ప్రకారం.. నర్సింహచారి, నరేశ్ గ్రామంలో బంగారం దుకాణం నిర్వహిస్తున్నారు. ఎప్పటిలాగే దుకాణానికి తాళం వేసి ఇంటికెళ్లారు. ఉదయం వచ్చి చూసి చూసేసరికి తాళం తీసి ఉంది. గుర్తు తెలియని వ్యక్తులు ఆభరణాలు దాచిపెట్టిన డెస్క్‌ను ఎత్తుకెళ్లారు. డెస్క్‌లో 45 గ్రాములు బంగారు ఆభరణాలు, కిలో వెండి వస్తువులు, ఇతర వస్తువులున్నాయని, వాటి విలువ సుమారు రూ.మూడు లక్షల వరకు ఉంటుందని తెలిపారు. పోలీసులు చేరుకొని అన్ని కోణాల్లో పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దత్తాత్రి తెలిపారు.

కాపర్ వైరుచోరీ

జమ్మికుంట: గుర్తు తెలియని దొంగలు ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్‌వైరును చోరీ చేసిన ఘటన జమ్మికుంట మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని తనుగుల శివారులో ఈనెల 12తేదీ రాత్రి గుర్తు తెలియని దొంగలు ట్రాన్స్‌ఫార్మర్ పగులగొట్టి రూ.40వేల విలువైన కాపర్‌వైర్‌ను ఎత్తుకెళ్లారు. తనుగుల విద్యుత్‌శాఖ ఏఈ రవీందర్ ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ బొర్రపటి రమేశ్ తెలిపారు.

బొగ్గుబాయి వార్తలు

వృత్తి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి


శిక్షణ కేంద్రం సందర్శనలో అలివేణిసుధాకర్‌రావు

రామగిరి(మంథని): ఆర్జీ-3 ఏరియా సేవా సమితి ఆధ్వర్యంలో అందిస్తున్న పలు ఉచిత వృత్తి శిక్షణ తరగతులను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సేవా అధ్యక్షురాలు ఎన్.అలివేణిసుధాకర్‌రావు అన్నారు. సెంటనరీకాలనీలోని సేవా భవనంలో ఏర్పాటు చేసిన ఉచిత వృత్తి శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. కేంద్రంలో టైలరింగ్, మగ్గం వర్క్స్, ఫ్యాషన్ డిజైనింగ్, జ్యూట్ బ్యాగ్‌ల తయారీ, బ్యూటీషియన్ వంటి విభాగాల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్‌రెడ్డి, కోఆర్డినేటింగ్ అధికారి గుర్రం శ్రీహరి, సేవా కార్యదర్శి మల్లేశ్వరి, సంయుక్త కార్యదర్శి ఉమాదేవి, రాజమల్లు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సొంతింటి కల నెరవేరుస్తాం

- సీఐటీయూ జనరల్ సెక్రెటరీ నరసింహారెడ్డి


మాట్లాడుతున్న నరసింహారెడ్డి

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో సీఐటీయూను గెలిపిస్తే కార్మికుల సొంతింటి కల నెరవేరుస్తామని సీఐటీయూ జనరల్ సెక్రెటరీ మంద నరసింహారెడ్డి అన్నారు. ఆర్జీ-2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. పెర్క్స్ (అలవెన్స్) మీద ఇన్‌కంటాక్స్ రీయింబర్స్‌మెంట్ ఇప్పిస్తామని, ప్రభుత్వం నుంచి సింగరేణికి రావాల్సిన రూ.29వేల కోట్ల బకాయిలు వచ్చేలా కృషిచేసి, కొత్త భూగర్భ గనుల ఏర్పాటుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్మికుల మారుపేర్ల సమస్యను పరిష్కరించి, డిపెండెంట్ వయస్సు 35 నుంచి 40 ఏళ్లకు పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మహిళా ఉద్యోగులకు చట్టపరమైన హక్కులు కల్పిస్తామని, కోల్ ఇండియా తరహాలో క్యాడర్ స్కీమ్‌లు, ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు ఇప్పిస్తామన్నారు. సింగరేణిలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ, కార్మికులకు మెరుగైన రక్షణ సౌకర్యాలు కల్పించుటకు కృషి చేస్తామని తెలిపారు. ఈనెల 27న జరగనున్న గుర్తింపు ఎన్నికల్లో సీఐటీయూ సంఘం ఉదయించే సూర్యుని గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో జిల్లా సెక్రెటరీ ముత్యం రావు, ప్రవీణ్‌కుమార్, సంతోష్, మొగిలి, విజయ్‌కుమార్‌రెడ్డి, కొమురయ్య, గోపాల్, ప్రభాకర్, పాషా, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

తొత్తు సంఘాలను ఓడించండి


మాట్లాడుతున్న సారయ్య

గోదావరిఖని(రామగుండం): రాబోయే గుర్తింపు సంఘం ఎన్నికల్లో తొత్తు సంఘాలను ఓడించాలని ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి సారయ్య పిలుపునిచ్చారు. గురువారం ఓసీపీ-3 కృషి భవన్‌లో ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో మాట్లాడారు. కార్మికుల హక్కులకోసం నిజాం కాలంలో పుట్టిన ఏఐటీయూసీ గడిచిన 82 ఏళ్లుగా సింగరేణిలో పనిచేస్తుందన్నారు. రోజుకో కండువా మార్చే నాయకులను తరిమికొట్టాలన్నారు. సింగరేణిలో ప్రస్తుతం ఉన్న హక్కులన్నీ ఏఐటీయూసీ పోరాడి సాధించినవేనని అన్నారు. సింగరేణి పరిరక్షణ, కొత్త బావుల ఏర్పాటు, విద్య, వైద్యం, క్యాడర్ స్కీంలు మెరుగు పరుస్తామని పేర్కొన్నారు. కార్మికవర్గం నక్షత్రం గుర్తుపై ఓటేసి భారీ మెజార్టీతో తమ యూనియన్‌ను గెలిపించాలని కోరారు. సమావేశంలో నాయకులు ఎల్.ప్రకాశ్, రాజరత్నం, జిగురు రవీందర్, అన్నారావు, వెంకటేశ్వర్లు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంఎస్‌తోనే కార్మికుల హక్కులు సాధ్యం


మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

రామగిరి(మంథని): కార్మికుల హక్కుల సాధనే లక్ష్యంగా హెచ్‌ఎంఎస్ పోరాడుతుందని ఈ యూనియన్ జనరల్ సెక్రెటరీ రియాజ్ అహ్మద్ అన్నారు. ఆర్జీ-3 పరిధి ఓసీపీ-2లో గురువారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. హెచ్‌ఎంఎస్ గుర్తింపు సంఘంగా ఏర్పడితే కోల్ ఇండియ మాదిరిగా ఇన్‌కంట్యాక్స్ వాపస్, సొంతింటి పథకం, సింగరేణి పాఠశాలలో సీబీఎస్ఈ, క్యాడర్ స్కీ జనరల్ డిజిగ్నేషన్ మార్పిడి, మహిళ కార్మికులకు విద్యార్హతను బట్టి ఉద్యోగాలతో పాటు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో ఆర్జీ-3 బ్రాంచ్ సెక్రటరీ మహ్మద్ ఇస్మాయిల్, కొమ్ము మధునయ్య, ఉమా మహేశ్వర్, మహమూద్‌ఖాన్, గోషిక అశోక్, సత్యనారాయణ, క్రాంతికిరణ్, శాంతి స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

భూతగాదాతో యువకుడి హత్య

- నర్సింహులపల్లెలో దారుణం
- గొడ్డలితో నరికి ఘాతుకం


ద్యాగ రాకేశ్ (ఫైల్)


ఆసుపత్రికి తరలిస్తున్న గ్రామస్తులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): భూతగాదాతో యువకుడు హత్యకు గురైన సంఘటన తంగళ్లపల్లి మండలం నర్సింహులపల్లెలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు. నర్సింహులపల్లెకు చెందిన ద్యాగ కనకయ్య, ద్యాగ మల్లేశం మధ్య కొన్నేళ్లుగా భూవివాద కొనసాగుతోంది. ఈక్రమంలో శుక్రవారం కనకయ్య కొడుకు ద్యాగ రాకేశ్(22), తల్లి ఎల్లవ్వతో కలిసి పొలం పనులకు వెళ్లారు. కాగా మల్లేశం కొడుకు తిరుపతి అక్కడికొచ్చి పాతకక్షలను దృష్టిలో పెట్టుకొని రాకేశ్‌పై గొడ్డలితో దాడి చేశాడు. పక్కనే ఉన్న అతని తల్లి ఎల్లవ్వ కేకలు వేయడంతో తిరుపతి అక్కడి నుంచి పరారయ్యాడు. రక్తస్రావంతో ఉన్న రాకేశ్‌ను చుట్టుపక్కల వారు సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే రాకేశ్ మృతిచెందినట్లు తెలిపి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. మృతుడికి తండ్రి కనకయ్య, తల్లి ఎల్లవ్వ, ఇద్దరు అక్కలు ఉన్నారు. గ్రామానికి చెందిన ద్యాగ మల్లేశం, పాతూరి నర్సింహారెడ్డి, బొగ్గులం జనార్దన్, మందాటి చిన్నతిరుపతి ప్రోద్బలంతోనే తన కొడుకును తిరుపతి హత్యచేశాడని ఇచ్చిన ఫిర్యాదుతో తంగళ్లపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రూరల్ సీఐ సదన్‌కుమార్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. గ్రామంలో గొడవలు జరగకుండా పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

యువతిని మోసం చేసిన వ్యక్తిపై కేసు

జమ్మికుంట(హుజూరాబాద్): మాయమాటలతో ఓ యువతిని మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ బొర్రపటి రమేశ్ గురువారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. వీణవంక మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన గాజుల చందు జమ్మికుంట పట్టణంలో నివాసం ఉంటున్న ఓ యువతిని మాయమాటలతో లోబర్చుకున్నాడనామెను శారీరకంగా వాడుకుని, గర్భవతిని చేసి మోసం చేశాడు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ రమేశ్ వివరించారు.